క్లుప్తంగా

అప్పల బాధ తాళలేక ఆత్మహత్య

కంబాలచెరువు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదెమ్మదిబ్బలోని వాంబే కాలనీలో మంగళవారం జరిగింది. ఆ ప్రాంతానికి చెందిన కరణం రాము (30) అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో గోపాలపురంలో నివాసం ఉంటున్నాడు. అయితే వాంబేగృహాల్లోని తన సొంతింటికి వచ్చిన రాము ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక..

లాలాచెరువు సమీపంలోని ఆల్‌బ్యాంక్ కాలనీలో నివాసముంటున్న ఆళ్ల సంతోష్ (40) కడుపునొప్పి తాళలేక పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అతడు కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



శ్యామ్‌ప్రసాద్ (ఫైల్)

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై బైక్‌ను లారీ ఢీకొనడంతో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల మేరకు, కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన చిక్కాల శ్యామ్‌ప్రసాద్(29) వేంపాడు సమీపంలో సుబి ఇన్‌ఫ్రా ఫ్యాబ్రికేషన్ వర్క్ షాపులో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బైక్‌పై టోల్ ప్లాజా వద్ద టీ పాయింట్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి లారీ ఢీకొంది. బైక్ నడుపుతున్న శ్యామ్‌ప్రసాద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న స్నేహితుడు సాయిబాబాకు గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోలీసులు నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సన్నిబాబు తెలిపారు.

రాగి జావ తాగి విద్యార్థులకు అస్వస్థత

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీలోని జగ్గిరాజుపేట మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మంగళవారం ఉదయం అల్పాహారంగా ఇచ్చిన రాగి జావ తాగి విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలకు మొత్తం 26 మంది విద్యార్థులు హాజరవ్వగా, 14 మంది వాంతులతో అస్వస్థతకు గురవ్వడం చర్చనీయాంశమైంది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసే కుక్ ముందుగా ఇంటి వద్దే ఆహారం తయారు చేసి, ఫంక్షన్‌కు వెళ్లడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని హెచ్‌ఎం వరలక్ష్మి తెలిపారు. హెచ్‌ఎం అందించిన సరకులతోనే పిల్లలకు ఆహారాన్ని తయారు చేసి, బంధువుల పెళ్లికి వెళ్లానని కుక్ సుజాత పేర్కొన్నారు. కాగా..విద్యార్థులకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.

శత వసంతాల మందిరం

- శతాబ్దిలోకి అడుగిడుతున్న పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి
- నేడు శతవార్షికోత్సవం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేవలం ప్రార్థనా మందిరంగా విశ్వాసులకు స్వస్థత అందించడమే కాదు.. ఎంతో మంది పిల్లలకు విద్యాదానం చేసి ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత ఆ ప్రార్థనా మందిరం సొంతం. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో పురాతన క్రైస్తవ దేవాలయాల్లో పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి (ఆర్‌సీఎం) ఒకటి. దీని నూరో వసంతంలోకి అడుగు పెడుతున్న ఈ చర్చి శతవార్షికోత్సం బుధవారం నిర్వహించనున్నారు. ఈ చర్చికి ఎంతో చరిత్ర ఉంది. బ్రిటిష్ వారి పాలనలో ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజీ, గోదావరిపై బ్రిడ్జి నిర్మాణానికి బ్రిటన్, ఫ్రాన్స్ దేశస్తులు ఇక్కడకు వచ్చి స్థానిక ఆల్కాట్‌తోట ప్రాంతంలో నివాసం ఉండేవారు. వీరందరూ రోమన్ కేథలిక్‌లు. వీరి కోసం ఒక చర్చి నిర్మించాలని నాటి ఫ్రెంచ్ గురువులు భావించారు. ఈ మేరకు ఆల్కాట్‌తోట ప్రాంతంలో 1925లో ఈ చర్చి నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచీ ఇందులో ఫ్రెంచ్ గురువులు, బ్రిటిష్ గురువులు సేవలందించారు. అనంతరం కేరళ, ప్రస్తుతం తెలుగు ఫాదర్లు సేవలందిస్తూ వస్తున్నారు. దేశ విదేశాలకు చెందిన సుమారు 70 మంది ఫాదర్లు ఈ చర్చిలో సేవలందించారు. ఫ్రాన్స్‌కు చెందిన రోజలిన్, బీ, తెలుగు ప్రాంతానికి చెందిన గోఫ్ ఇగ్నేషియన్, కాగితపు మరియదాస్‌లు ఈ చర్చిలో బిషప్‌లుగా సేవలందించారు. తొలుత ఫ్రెంచ్, బ్రిటిష్ రోమన్ కేథలిక్‌లు మాత్రమే ఈ చర్చికి వస్తూండేవారు. ప్రస్తుతం 500 కుటుంబాల వారు ఈ చర్చికి వస్తున్నారు. పీఠాధిపతులైన బిషప్‌లు ఇన్నయ్య, కాగితపు మరియదాస్, మల్లవరపు ప్రకాష్, పొలిమేర జయరావు ఈ చర్చిని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రెవరెండ్ ఫాదర్లు రవీంద్రకుమార్, కె.ప్రభాకర్ సేవలందిస్తున్నారు.



శతాబ్దిలోకి అడుగు పెడుతున్న పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి



మేరీమాత గ్రోటా

1933లో పాఠశాల

ఈ చర్చికి అనుబంధంగా 1933లో ఆర్‌సీఎం పాఠశాలను స్థాపించి, అంచెలంచెలుగా అప్పర్ ప్రైమరీ, ఉన్నత పాఠశాలగా తీర్చిదిద్దారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇక్కడ చదువుకుని, ఉన్నత స్థానాలు అందుకున్నారు.

పలు కార్యక్రమాలు

పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి వందో వసంతంలోకి అడుగు పెడుతున్న తరుణంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి శతవార్షికోత్సం నిర్వహించనున్నారు. బిషప్‌లు పొలిమేర జయరావు, రాయరాల విజయకుమార్, కరణ దమమ్‌కుమార్, మల్లవరపు ప్రకాష్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా గురుత్వ రజత జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న రెవరెండ్ బవిరి సురేష్, రెవరెండ్ ఈగల ఆగ్నేల్ రవీంద్రకుమార్‌లను సత్కరించనున్నారు. అనంతరం సెయింటాన్స్ పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి.



పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి ముఖద్వారం

ఏర్పాట్లు పూర్తి



పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి శతవార్షికోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనికి బిషప్‌లతో పాటు 150 మంది ఫాదర్లు, వివిధ మేత్రాశకాల సభలకు చెందిన గురువులు, 80 మంది కన్యస్త్రీలు, 2 వేల మంది విశ్వాసులు పాల్గొంటారు.

– రెవరెండ్ ఫాదర్ ఈప రవీంద్రకుమార్, పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి

చివరాఖరికి కదలిక

- రత్నగిరిపై కలెక్టర్ తనిఖీతో అధికారుల్లో చలనం
- దేవస్థానం ర్యాంకు తగ్గడంపై అసంతృప్తి
- వివిధ విభాగాలను పరిశీలించిన ఈఓ

అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ దేవస్థానం అధికారుల్లో చలనం వచ్చింది. రాష్ట్రంలోని ఏడు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో రత్నగిరికి చివరి ర్యాంకు రావడంతో, దేవస్థానంలో మార్పు తెచ్చేందుకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ప్రత్యేక దృష్టి సారించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే సోమవారం ఆయన దేవస్థానంలోని వివిధ విభాగాల్లో తనిఖీలు చేశారు. భక్తులతో నేరుగా మాట్లాడారు. వసతి గదుల విభాగంలో అవకతవకలు ఉండడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దేవస్థానంలో తీసుకునే ప్రతి కీలక నిర్ణయాన్ని కలెక్టర్ పరిశీలించనున్నారు. దేవస్థానంలో ఆయా విభాగాల అధికారులపై వేటుకూ వెనుకాడని పరిస్థితులు నెలకొనడంతో ఆయా వర్గాల్లో కదలిక మొదలైంది. కాగా దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు ఇతర అధికారులతో కలసి అన్నదాన విభాగం, న్యూ సీసీ, ఓల్డ్ సీసీ సత్రాల్లో మరమ్మతులు చేయాల్సిన గదులు, పాత మెయిన్ గెస్ట్‌హౌస్ వెనుక టాయిలెట్స్‌ను మంగళవారం పరిశీలించారు. మరమ్మతులు వెంటనే పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈఓ వెంట ఈఈ రామకృష్ణ, ఇతర అధికారులున్నారు.

బఫే పద్ధతిలో భోజనాలు

అన్నదానం విభాగంలో భక్తులకు భోజనాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించిన విషయం విదితమే. దీనిపై అన్నదానం హాలు మొదటి అంతస్తులో కొందరు భక్తులకు బఫే పద్ధతిలో భోజనాలు పెడతామని అధికారులు తెలిపారు. దీనిపై ఈఓ సుబ్బారావు అన్నదాన విభాగాన్ని పరిశీలించారు.



సోమవారం డార్మెట్రీ వద్ద టాయిలెట్లను పరిశీలించి, అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

ఆహార పదార్థాల తరలింపు కోసం లిఫ్ట్ ఏర్పాటు చేయాల్సి ఉంది. భక్తులు వెళ్లేందుకు మెట్లు కూడా నిర్మించాలి.

వచ్చే నెలలో మరోసారి తనిఖీ..!

జిల్లా కలెక్టర్ వచ్చే నెలలో కూడా దేవస్థానంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఈసారీ ఆకస్మిక తనిఖీలు చేస్తారని దేవస్థాన వర్గాలు చెబుతున్నాయి. పరిస్థితులు గాడిన పడే వరకు ప్రతి నెలా దేవస్థానానికి వస్తానని కలెక్టర్ చెప్పిన విషయం విదితమే. సోమవారం కలెక్టర్ పర్యటన ముందుగా నిర్ణయించినది కావడంతో దేవస్థానం అధికారులు జాగ్రత్త పడ్డారనే ప్రచారం సాగుతోంది. ఇలాఉండగా ఈ నెలాఖరు నుంచి వచ్చే నెలాఖరు వరకు సత్యదేవుని ఆలయానికి విచ్చేసిన భక్తుల నుంచి ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రభుత్వం సమాచారం సేకరించనుంది. దాని ఆధారంగా మరలా ర్యాంకులు కేటాయిస్తారు. తొలి మూడు ర్యాంకుల్లో అన్నవరం దేవస్థానం ఉండేలా సేవలు మెరుగుపడాలని ఇప్పటికే కలెక్టర్ ఆదేశించారు.

పోలవరం కాలువ పనుల అడ్డగింపు



తాళ్లూరు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, రైతులు



డీఈ మురళికి సమస్యలు వివరిస్తున్న ఆందోళనకారులు

బ్రిడ్జి నిర్మించాలని ఆందోళనకారుల డిమాండ్

తుని రూరల్: వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ పోలవరం ఎడమ ప్రధాన కాలువ తవ్వకం పనులను తుని మండలం తాళ్లూరు వద్ద రైతులు, గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. తమ పొలాలకు, ఇళ్లకు వెళ్లేందుకు రహదారి మార్గం లేకుండా కాలువ నిర్మిస్తుండడంతో తాళ్లూరు గ్రామస్తులు ఈ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ భూసేకరణలో తమ గ్రామానికి చెందిన 300 ఎకరాలు ఇచ్చామన్నారు. మిగిలిన 400 ఎకరాలు సాగు చేస్తూ బతుకుతున్నామని చెప్పారు. కాలువకు ఓవైపు భూములు, జగనన్న కాలనీ, గ్రామ దేవత గుడి, లక్ష్మీనారాయణ గుడి, మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర వసతి గృహం(నిర్మాణంలో ఉంది) ఉండగా, మరోవైపు గ్రామమంతా ఉందని వివరించారు. గ్రామస్తులు కాలనీకి, వ్యవసాయ పనుల కోసం పొలాలకు, గుళ్లకు వెళ్లాలన్నా కాలువ దాటుకుని వెళ్లాల్సి ఉందన్నారు. అందుకు అనువుగా వంతెన నిర్మించిన తర్వాతే, పోలవరం కాలువ పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. పదేళ్లుగా తమ సమస్యను పట్టించుకోకపోవడంతోనే పనులను అడ్డుకోవాల్సి వచ్చిందన్నారు. తమ సమస్యలను పరిష్కరిస్తేనే, కాలువ పనులకు సహకరిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో సంఘటన స్థలానికి పోలవరం కాలువ డీఈ మురళీ, ఏఈ డాక్టర్ మహేష్‌కుమార్, ఇతర అధికారులు చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. గ్రామస్తులు, రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వారు తెలిపారు. స్పష్టమైన హామీ వచ్చే వరకు పనులు చేపట్టవద్దని ఆందోళనకారులు భీష్మించారు. అప్పటికే రాళ్లను పేల్చేందుకు అమర్చిన పేలుడు సామగ్రిని తొలగించడం సాధ్యం కాదని, పేలుళ్ల పూర్తయ్యాక పనులు నిలిపివేస్తామని అధికారులు చెప్పడంతో, ఆందోళనకారులు అంగీకరించి, అక్కడి నుంచి నిష్క్రమించారు.

ఫీల్డ్ ఆపరేటర్ కార్మికుల నిరాహార దీక్ష



ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న సురేష్‌కుమార్, కార్మికులు

- ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వద్ద ఆందోళన
- వేతన సవరణ చేయాలని పీఈయూ నేత సురేష్‌కుమార్ డిమాండ్

రాజమహేంద్రవరం రూరల్: వేతన సవరణ కోసం ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్‌లో పనిచేస్తున్న 360 మంది ఫీల్డ్ ఆపరేటర్ కార్మికులు ఆందోళన ముమ్మరం చేశారు. యాజమాన్యానికి నోటీసులు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో, మంగళవారం ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్ కార్యాలయం వద్ద ఆందోళనకు ఉపక్రమించారు. పెట్రోలియం ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ కొడవటి సురేష్‌కుమార్ సారథ్యంలో కార్మికులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ, ఫీల్డ్ ఆపరేటర్ కార్మికులకు ప్రతి నాలుగేళ్లకు వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు. 2019కి చివరగా వేతన సవరణ అసంపూర్తిగా జరిగినందున ప్రతి కార్మికునికి రూ.4,050 జీతం తక్కువగా అందుతోందన్నారు. 2023 జనవరి ఒకటి నుంచి కొత్త వేతన సవరణ జరగాల్సి ఉందన్నారు. దీనిపై యాజమాన్యం నుంచి ఎటువంటి ఫలితం లేకపోవడంతో, ఈ ఏడాది జనవరిలో యాజమాన్యానికి నోటీసులు అందజేశామన్నారు. యాజమాన్యం కొంత సమయం కోరడంతో ఇప్పటివరకు సంయమనం పాటించామన్నారు. పరిస్థితుల్లో మార్పు లేకపోవడంతో నిరహార దీక్ష చేపట్టాల్సి వచ్చిందన్నారు. వేతన సవరణతో పాటు, ఇతర కార్మిక డిమాండ్లపై మంగళవారం సాయంత్రం యాజమాన్యానికి నిరవధిక సమ్మె నోటీసు అందజేశామని సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం నుంచి దశలవారీగా నిరసనలు తెలుపుతూ, మార్చి 12 నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని నిర్ణయించామన్నారు. యూనియన్ రాజమండ్రి అసెట్ జనరల్ సెక్రటరీ జి.ప్రశాంత్‌కుమార్, ఇతర కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయంలో కానుకల చోరీ కేసులో జైలు

తిరుత్తణి: ఆలయంలో వినూత్నంగా కానుకలు చోరీ చేసిన వ్యక్తికి ఆరేళ్ల జైలు శిక్షను విధిస్తూ తిరుత్తణి కోర్టు తీర్పు వెలువరించింది. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గతేడాది ఏప్రిల్‌లో కొండ ఆలయ హుండీల్లో భక్తులు చెల్లించే కానుకలను ఓ వ్యక్తి నూలు సంచిలో పడేలా హుండీ లోపలి భాగంలో ఏర్పాటు చేస్తున్నట్టు సీసీ కెమెరాల్లో ఆలయ అధికారులు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుత్తణి పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం సిద్యాలయ గ్రామానికి చెందిన జేమ్స్ శ్యామ్ వేల్‌ను నిందితుడిగా గుర్తించి అరెస్టు చేశారు. తిరుత్తణి క్రిమినల్ కోర్టులో జరిగిన కేసు విచారణలో నేరం రుజువైంది. నిందితుడికి ఆరేళ్ల పాటు జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ముత్తురాజ్ తీర్పు చెప్పారు.

వారందరికీ న్యాయపరమైన హక్కులు

కంబాలచెరువు: లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్, ఇంటర్ సెక్స్, అలైంగిక విధానంలో జీవనం గడిపే వ్యక్తుల మనోభావాలను గుర్తించిన సుప్రీంకోర్టు, వారికి న్యాయపరమైన హక్కును పొందేందుకు అవకాశం కల్పించిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. స్థానిక జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యాలయంలో మంగళవారం ఎల్‌జీబీటీక్యూఐఏ ప్లస్ కమ్యూనిటీ సభ్యుల హక్కులు, వాటిపై ప్రత్యేక చట్టపరమైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పారా లీగల్ వలంటీర్లు విధి నిర్వహణలో బాధ్యతలను గుర్తెరిగి పనిచేయాలన్నారు. ఈ శిక్షణ తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్‌జీబీటీక్యూఐఏ పై సందేహాలను నివృత్తి చేయడానికి హైదరాబాద్ నుంచి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు హాజరవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ న్యాయమూర్తి ఎ.గాయత్రి, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి, సాది సంస్థ ప్రతినిధులు, పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

పీఎంపీలకు వైద్య, విజ్ఞాన సదస్సు

కంబాలచెరువు: కమ్యూనిటీ పారా మెడిక్స్ – ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) రాజానగరం, రంగంపేట, గోకవరం మండలాల సభ్యులకు మంగళవారం జేఎన్ రోడ్డులోని మదర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆవరణలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ బి.హిమజా రెడ్డి మాట్లాడుతూ మహిళలకు వచ్చే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను వివరించారు. డాక్టర్లు మేఘన, కోటేశ్వర్, సౌజన్య, రఘునాథ్ మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం తదితరులు పాల్గొన్నారు.

పోలవరం పూర్తి చేసేందుకు కాంగ్రెస్ కృషి

రాజమహేంద్రవరం సిటీ: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పోలవరం ప్రాజెక్టుకు ఇందిరా సాగర్ పోలవరం పేరుతో బీజం వేశారని పీసీసీ ఉపాధ్యక్షుడు, పోలవరం ప్రాజెక్టు సమస్యలు, నిర్వాసితుల అధ్యయన కమిటీ చైర్మన్ ఎస్.మార్టిన్ లూథర్ అన్నారు. పోలవరం ప్రాజెక్టు స్థితిగతులు, నిర్వాసితుల పరిస్థితి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ తదితర అంశాల పరిశీలనకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నియమించిన కమిటీ సభ్యులు మంగళవారం నగరంలోని డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. లూథర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆశయ సాధనకు, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాంగ్రెస్ పోరాడుతుందన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పెదపూడి: ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణకు సాయం చేస్తున్న యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఉదంతమిది. ఎస్సై రామారావు వివరాల మేరకు, కైకవోలు గ్రామంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని మంగళవారం ఉదయం శివాలయం వద్ద విద్యుద్దీపాల అలంకరణ చేస్తున్నారు. ఈ ఏర్పాట్లకు స్థానికుడైన జీకే విశ్వేశ్వరరావు(22) సాయం చేస్తున్నాడు. విద్యుత్ తీగ తగలడంతో అతడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని పెదపూడి సీహెచ్‌సీకి తీసుకెళ్లి, మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి చక్రరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మండపేట: పట్టణంలోని మెహర్‌బాబా స్కూల్ ఎదురుగా ఉన్న పెద్ద కాలువలో సుమారు 35 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు మంగళవారం కనుగొన్నారు. సుమారు 5.6 అడుగుల ఎత్తు ఉన్నాడు. స్కైమన్ అని రాసి ఉన్న నలుపు జీన్స్ ప్యాంట్, పింక్ పొడవు చేతుల గళ్ల చొక్కా మృతదేహానికి ఉన్నాయి. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ దారం సురేష్ తెలిపారు.

క్వార్టర్స్ దశలో హాకీ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా సివిల్ సర్వీసెస్ కల్చరల్, స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ పర్యవేక్షణలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీస్ హాకీ పోటీలు మంగళవారం క్వార్టర్స్ దశకు చేరాయి. మధ్యప్రదేశ్‌పై సెంట్రల్ సెక్టార్, ఛత్తీస్‌గఢ్‌పై ఆంధ్ర ప్రదేశ్, కేరళ సెక్టార్‌పై రాజస్థాన్ సెక్టార్ విజయం సాధించాయి. డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్, కోకనాడ స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపకుడు రవిచంద్ర, అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు దాసరి మురళీకృష్ణ, టోర్నమెంట్ కమిటీ సభ్యులు మ్యాచ్‌లను తిలకించారు.

మృత్యువు విడదీయని స్నేహ బంధం

- ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకుల మృతి
- పోలీస్ స్టేషన్ ఎదుట మృతుల బంధువుల ఆందోళన



ముత్యాలరావు, వెంకటేష్(ఫైల్)

ధవళేశ్వరం: వారిద్దరూ స్నేహితులు. కలిసిమెలిసి తిరుగుతూ.. జీవితానందాన్ని ఆస్వాదిస్తున్న వారిని మృత్యువు అమాంతం మింగేసింది. ఆ మృత్యువు కూడా ఆ స్నేహితులను విడదీయలేకపోయింది. ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ధవళేశ్వరం జాలరుపేటకు చెందిన యువకులు నాగమల్లి ముత్యాలరావు(18), బొడ్డు వెంకటేష్(16) మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం 3.30కు రాజోలు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజోలు నుంచి రాజమహేంద్రవరానికి వెళుతోంది. ధవళేశ్వరం కాటన్‌పేట సమీపంలో ముత్యాలరావు, వెంకటేష్ మోటార్ బైక్‌పై వెళుతూ ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేయబోయారు. అదుపుతప్పి కిందపడడంతో వారి తలలపై నుంచి బస్సు వెనుక చక్రాలు దూసుకెళ్లి, అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జాలరుపేట వాసులు, స్థానికులు కలిసి సంఘటన స్థలంలో ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. దీంతో వేమగిరి వైపు నుంచి వచ్చే వాహనాలను హైవే మీదుగా, రాజమహేంద్రవరం నుంచి వచ్చే వాహనాలను ఐఎల్‌టీడీ జంక్షన్ నుంచి మళ్లించారు. ఆందోళన చేస్తున్న మృతుల బంధువులతో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చర్చలు జరిపారు. వ్యక్తిగతంగా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఆర్టీసీ అధికారులు రూ.15 వేల చొప్పున ప్రకటించారు. ధవళేశ్వరం సీఐ టి.గణేష్ వ్యక్తిగతంగా రూ.10 వేల చొప్పున డీఎస్పీ భవ్య కిషోర్ చేతుల మీదుగా అందజేశారు. దీంతో ఆందోళనకారులు శాంతించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐలు గణేష్, కె.మంగాదేవి, వెంకటేశ్వరరావు, ఎస్సైలు క్రాంతికుమార్, హరిబాబు తదితరులు బందోబస్తు నిర్వహించారు. చిన్న వయసులోనే యువకులు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. జాలరుపేట ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు, బైక్

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	18,500
గటగట (వెయ్యి)	16,500
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	15,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	14,500 – 15,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఆకట్టుకున్న సైన్స్ రంగోలీ



నేలపై విద్యార్థులు తీర్చిదిద్దిన సైన్స్ చిత్రాలు

రాజమహేంద్రవరం రూరల్: సైన్స్ దినోత్సవాన్ని (ఈ నెల 28) పురస్కరించుకుని మంగళవారం బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ రంగోలీ, సైన్స్ ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి పర్యవేక్షణలో ఉపాధ్యాయుల సహకారంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమం జరిగింది. మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకూ మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నేలపై సైన్స్ చిత్రాలను అందంగా తీర్చిదిద్దారు. అలాగే వివిధ రకాల ప్రాజెక్టులు తయారు చేశారు. ఈ పోటీల్లో విజేతలకు సైన్స్ దినోత్సవం రోజు బహుమతులు అందజేయనున్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద గల రెడ్ క్రాస్ భవనంలో మంగళవారం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ మహాలక్ష్మి, గొట్టిముక్కల అనంతరావు, డాక్టర్ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన ఉండాలన్నారు. రెడ్ క్రాస్ కార్యక్రమాల్లో పాల్గొని సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.

పకడ్బందీగా పోలింగ్ మెటీరియల్ తరలింపు

రాజమహేంద్రవరం సిటీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్‌ను అత్యంత పకడ్బందీగా తరలించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సహాయ రిటర్నింగ్ అధికారి టి.సీతారామమూర్తి, ఆర్డీఓ కృష్ణ నాయక్, తహసీల్దార్ పాపారావుతో కలిసి మంగళవారం ఆమె పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా స్టాట్యూటరీ, నాన్ స్టాట్యూటరీ ఫారాలను ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 92 పోలింగ్ కేంద్రాలకు 15 రూట్ల ద్వారా మెటీరియల్ తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత పోలింగ్ సిబ్బంది, భద్రతా సిబ్బంది ముందుగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సజావుగా ఎన్నికలు నిర్వహించడం కోసం 400 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. మొత్తం 62,970 ఓటర్లు ఉండగా, వారిలో పురుషులు 36,366 మంది, స్త్రీలు 27,601 మంది ఇతరులు ముగ్గురు ఉన్నారన్నారు.



పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆర్ట్స్ కళాశాల ఎంఏ విద్యార్థుల ఘనత



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే

కంబాలచెరువు: యూజీసీ నెట్ పీహెచ్‌డీ ప్రవేశాలకు ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన జాతీయ అర్హత పరీక్షలో స్థానిక ప్రభుత్వ కళాశాలకు చెందిన ముగ్గురు ఎంఏ తెలుగు విద్యార్థులు అర్హత సాధించారు. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మంగళవారం విలేకరులకు తెలిపారు. తమ విద్యార్థులు ఉల్లెం నాగమణి, కారం సత్య తులసి, సిరపు శ్రావణి.. పరిశోధనలకు అర్హత సాధించారన్నారు. వారిలోని ప్రతిభను వెలికి తీసిన తెలుగుశాఖాధిపతులు డాక్టర్ పీఏ సత్యనారాయణ, తెలుగుశాఖ అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలలో బహుమతుల కైవసం



బహుమతులు అందుకుంటున్న రాజమహేంద్రవరం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: హర్యానాలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ శిబిరంలో సౌత్ సెంట్రల్ రైల్వే రాజమహేంద్రవరం స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు పలు బహుమతులు సాధించారు. ఈ విషయాన్ని స్కౌట్ మాస్టర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆఫీసు సూపరింటెండెంట్ హెచ్ఎంఎస్ రాజపుట్ మంగళవారం తెలిపారు. జాతీయ స్థాయిలో హర్యానాలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీలలో రాజమహేంద్రవరం విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, తమిళనాడు, హర్యానా, కేంద్రీయ విద్యాలయ, కేరళ, సౌత్ ఈస్టర్న్ రైల్వే, సౌత్ సెంట్రల్ రైల్వేలకు చెందిన 360 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. పోటీలలో ఫుడ్ ప్లాజా విభాగంలో మొదటి బహుమతి, ఆంధ్రప్రదేశ్ స్వరూపం విభాగంలో రెండవ బహుమతి, ఫెస్టివల్ ఆఫ్ ఇండియా విభాగంలో మకర సంక్రాంతికి రెండో బహుమతి, దేశభక్తి గీతాల పోటీల్లో రెండవ బహుమతి, హిందూ సంప్రదాయ వివాహానికి రెండో బహుమతి సాధించారని రాజపుట్ వెల్లడించారు.

మహా అన్నసమారాధనకు సర్వం సిద్ధం

రాజమహేంద్రవరం రూరల్: మహాశివరాత్రి సందర్భంగా మోరంపూడి జంక్షన్‌లోని సాయి భక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి, మోహిని దంపతుల ఆధ్వర్యంలో బుధవారం మహా అన్నసమారాధన జరుగుతుంది. గత 29 ఏళ్లుగా ఏటా శివరాత్రి రోజు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 1990లో మోరంపూడి సెంటర్‌లో చక్రపాణి చిన్న స్వీట్ స్టాల్ బండి నిర్వహించేవారు. అంచెలంచెలుగా ఎదిగి సాయి భక్తాంజనేయ తాపేశ్వరం స్వీట్స్ ఏర్పాటు చేశారు. 1995లో మహా శివరాత్రికి ముందు రోజు చక్రపాణి వద్దకు సిరిపురపు బ్రహ్మయ్య అనే వ్యక్తి వచ్చి పండగ సందర్భంగా పులిహోర పంచిపెడుతున్నామని చెప్పారు. ఆ క్షణంలోనే చక్రపాణికి మహా అన్నసమారాధన చేయాలన్న ఆలోచన వచ్చింది. ఆ సంవత్సరం నుంచే మోరంపూడి సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాగా.. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం జరిగే అన్నసమారాధనకు మోరంపూడి జంక్షన్‌లోని సీవీ రావు గార్డెన్స్‌లో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుమారు 25 వేల మంది భక్తులు తరలివస్తారని అంచనా.



మహా అన్నసమారాధనకు జరుగుతున్న ఏర్పాట్లు

పలు కార్యక్రమాలు

శివరాత్రి సందర్భంగా శ్రీపాద వ్యాఘ్రేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఉదయం శివపార్వతుల కల్యాణం, స్వామి వారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం 30వ మహా అన్నప్రసాద వితరణ జరుగుతుంది. సాయంత్రం మహాగురు నరేంద్రనాథ యోగేశ్వరేశ్వరస్వామి ప్రసన్నచే 23 హారతులు శ్రీభజనామృతం, రాత్రి వాసుదేవ కోలాట భజన మండలి గుమ్మడి రవి కోలాటం, రాత్రి 10 గంటల నుంచి దత్త ఉపాసకులు సతీష్ బృందం భజన, గురుతత్వంపై ఉపన్యాసం ఉంటుంది.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు నగర మహిళా ఎన్జీవో సంఘ చైర్‌పర్సన్ ఎం.సత్యవతి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. సత్యవతి మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో ఆటల పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని, నగరంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మహిళా ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. అనంతరం రాష్ట్ర ఏపీఎన్జీవో సంఘ అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వేణుమాధవరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నగర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు సుబ్బారావు నాయుడు, సహాధ్యక్షుడు అనిల్ కుమార్, ఎన్జీవో నాయకులు మీసాల మాధవరావు, రాఘవరావు, రాజేష్, కుమార్, మహిళా ఎన్జీవో సంఘ ప్రతినిధులు శ్యామల, నళిని వసుధ, గౌరి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ

కడియం: కడియపులంకలో గోదావరి తీరంలో వెలసిన హరిహర మహాక్షేత్రం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో అపర్ణా సమేత అనంతేశ్వరస్వామి, దేవేరీ సమేత వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్నారు. అలాగే వినాయకుడు, అపర్ణాదేవి, నవగ్రహాలయం, సూర్యభగవానుడి ఆలయం, లక్ష్మీ నారాయణ స్వామి, సాయిబాబా, కాలభైరవస్వామి ఆలయాలు ఉన్నాయి. ఒకే క్షేత్రంలో వీరందరినీ దర్శించుకునే భాగ్యం కలగడంతో పెద్ద ఎత్తున భక్తులు ఈ క్షేత్రానికి తరలివస్తున్నారు. ఉగాదికి పంచాంగ శ్రవణం, శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాలు, వినాయకచవితి, అపర్ణాదేవి నవరాత్రి ఉత్సవాలు, కార్తిక మాసం ఆరుద్ర నక్షత్రం రోజున లక్షబిల్వపత్రి పూజ, మాస శివరాత్రికి భారీ అన్నసమారాధన, ధనుర్మాసంలో లక్ష్మీనారాయణుల పూజలు జరుగుతాయి. ఆలయంలో ఎక్కడా హుండీ అనేదే లేదు. భక్తులు ఇచ్చే ప్రతి రూపాయికీ రశీదును అందజేయడం ఇక్కడి ప్రత్యేకత. తద్వారా సమకూరిన మొత్తాన్ని ఆలయాభివృద్ధికే ఖర్చు చేస్తారు. తూర్పు దిక్కున కోటిపల్లి కాలువ ప్రవహిస్తుంటుంది. ఆలయం చుట్టుపక్కల పరిసరాలు పచ్చని మొక్కలతో నిత్యనూతనంగా శోభిస్తుంటాయి. ప్రకృతి రమణీయతతో పాటు, ఆధ్యాత్మిక ఆనందాన్ని కూడా ఇక్కడికి వచ్చే భక్తులు పొందుతారు.

శివరాత్రికి పూర్తయిన ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద విశేష ఏర్పాట్లు చేసినట్టు ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ తెలిపారు. క్షేత్రంలో అపర్ణాసమేత అనంతేశ్వర స్వామివారికి బుధవారం తెల్లవారుజాము మూడు గంటల నుంచి పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం దర్శనం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు. రాత్రి ఏడు గంటలకు శివపార్వతుల శాంతి కల్యాణం, రాత్రి 9 గంటలకు గ్రామోత్సవం, 12 గంటలకు స్వామివారి లింగోద్భవ అభిషేకాలను ఆలయ అర్చకులు దేవరభట్ల శ్రీనివాసరావు (నాని) ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.



హరిహర మహాక్షేత్రం



కడియపులంకలోని అనంతేశ్వర స్వామి

ఆంజనేయస్వామి ఆలయ వజ్రోత్సవానికి సర్వం సిద్ధం

కడియం: కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వజ్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. సుమారు 75 ఏళ్ల క్రితం గ్రామస్తుల సహకారంతో మహాశివరాత్రి రోజున స్వామివారిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి నిత్యపూజలతో అర్చిస్తున్నారు. శివరాత్రి మధ్యాహ్నం ప్రత్యేకంగా బెల్లం తదితర ద్రవ్యాలతో భక్తులు తులాభారం సమర్పించుకుంటారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారి ఆలయం వద్ద 75 ఏళ్ల క్రితం ఆరు కుంచాలతో ప్రసాదం చేసి వితరణ చేయడం ప్రారంభించినట్లు పెద్దలు చెబుతారు. ప్రస్తుతం ఆరు టన్నుల బియ్యాన్ని అన్నదానం కోసం వినియోగిస్తున్నారు. దాతలు, నర్సరీ రైతుల సహకారంతో ఈ అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు.

విస్తృత ఏర్పాట్లు

ఆంజనేయ స్వామి ఆలయ 75వ వార్షికోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్ల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 170 మందికి పైగా ఆంజనేయ మాలలు ధరించారన్నారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో భక్తుల సహకారంతో సోమవారం 108 కలశాలతో మంత్రపూరిత సప్తనదీ జలములతో గ్రామ శ్రేయస్సు కోరుతూ సంప్రోక్షణ చేపట్టారు. అలాగే అఖండ దీపారాధన, అష్టదిక్పాలకపూజ, ధ్వజారోహణం చేశారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తెల్లవారు జామున 3 గంటల నుంచి స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం మహాఅన్న సమారాధన జరుగుతుందన్నారు. 27న లక్ష చామంతిపూజ, 28న దీపాలంకరణ, మార్చి 1న ఆవుపాలతో అభిషేకం, అదే రోజు సాయంత్రం 6 గంటలకు సువర్చలా సహిత ఆంజనేయ స్వామివారి శాంతి కళ్యాణం, 2న ఇరుముడి కట్టుట ఉంటాయన్నారు.



కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామివారు